
# అన్నపూర్ణమ్మతల్లి

వై.కె.మూర్తి



ఆ రోజు ఆదివారం. ఆయన కెట్లాగూ సెలవు రోజే కదా అని కాస్త ఆలశ్యంగా వంట మొదలెట్టాను. కూర తరుగుతూంటే వాకిట్లోంచి "అమ్మా.. అన్నపూర్ణమ్మ తల్లీ" అని వినిపించింది. నన్నందరూ పూర్ణా... పూర్ణా... అని పిలవడమే గాని పూర్తిపేరు పెట్టి పిలిచేవాళ్ళు చాలా తక్కువమంది. ఆ వచ్చింది ఎవరై వుంటారా అని వెళ్ళి చూసాను. బైటఎవరో ఇద్దరు అపరిచిత వ్యక్తులు నిలబడి వున్నారు. ఒకామె గంగా భాగీరథీ సమానురాలు. రెండవ ఆమె కుంకుమశోభితురాలు. వాళ్ళిద్దరూ నా వైపు తేరిపార చూడ సాగారు. "నేనేనండీ అన్నపూర్ణని... ఏం కావాలి'' అన్నాను. 'నాకు తెలుసమ్మా... నువ్వే అన్నపూర్ణవని. ఆ ముఖం ఎంత కళకళలాడిపోతోందని...ఏం లేదమ్మా మేమిద్దరం బెజవాడ పోదామని స్టేషనుకి వెళ్ళాము. రైలు మూడు గంటలు లేటట.. మళ్ళీ అంత దూరం యింటికేమి పోతామనుకొని మా పూర్ణచంద్రం యింటికి పోయి వద్దామనుకొని యిలా వచ్చాం" అంది కుంకుమ శోభితురాలు. అప్పటికి వాళ్ళు మామగారి తాలూకు బంధువులైవుంటారని అర్థమైంది నాకు. 'రండి... లోపలికి రండి' అన్నాను పక్కికి జరుగుతూ. "పూర్ణా లేడా అమ్మాయి?" అంది గంగాభాగీరథి. లేరండి పొరుగూరు వెళ్ళారు. వచ్చే టైమయింది అన్నాను. 'ఇంట్లో ఆడకూతురువి నిన్నొక్కదాన్ని విడిచి వెళ్ళాడా....' అంది గం. భా. స. చనువుగా కసురుతూ. వీళ్ళెవరో... ఎట్లా బంధువులో నాకు తెలియడం లేదు. ఆయనకేమైనా తెలుస్తుందేమోనని అనిపించింది. 'లేదండీ... వారి అబ్బాయి వున్నారు. పిలుస్తాను" అన్నాను. అబ్బాయి, అంటే నీ మొగుడేనా' అంది కు.శో. సమాధానంగా చిరునవ్వు నవ్వాను.. అబ్బ.... ఎంత సిగ్గొచ్చిందే నీకు. అంటూ బుగ్గమీద పొడిచింది గం.భా.స. ఈ అలజడికి 'ఎవరూ' అంటూ ఆయన రానే వచ్చారు. "మా నాయనే... ఇంత గుంటడప్పుడు చూసాను. ఎంత ఎదిగిపోయావురా" అంది కుంకుమ. మా ఆయన్ని చూడగానే 'అప్పట్లో నిన్ను' చంటోడా అనేవారు యిప్పుడేమని పిలుస్తున్నార్రా... అట్లాగేనా.. అంది గం.భా.స. మా ఆయన్ని చంటోడా అని పిలిచే వాళ్ళని తెలియగానే నాకు నవ్వు ముంచుకు వచ్చింది. ఆయన వైపు ఉరిమి చూస్తున్నారు.

నా పేరు రామారావు. అప్పుడూ యిప్పుడూ అలాగే ఎప్పుడూ పిలుస్తున్నారు అందరూ. ఇంతకీ మీరెవరు? అన్నారాయన కాస్త కటువుగా.

పాపం వాళ్ళిద్దరూ నొచ్చుకున్నారనిపించింది నాకు. అందుకే ఆయన్ని పక్కకి తీసుకెళ్ళి వాళ్ళు చెప్పిందంతా చెప్పాను. మామగారొస్తే ఎట్లాగు చుట్టరికం తెలుస్తుంది కదా ఓపిక పట్టమని

చెప్పాను. వాళ్ళకి నా పేరు తెలిసి ఆయనపేరు తెలియకపోయే సరికి నాకెంతో గొప్పగా అనిపించింది. "సరే... నీ అవస్థేదో నువ్వు పడు" అని అవతల గదిలోకి వెళ్ళిపోయారు ఆయన.

ఆ తర్వాత వాళ్ళకి స్నానాల గది చూపించి వంట ప్రయత్నంలో పడ్డాను. ఇంతలో గంగా "అమ్మా... పోష్టుందా?" అనడిగింది. పోస్టు యిప్పుడు రాదండి.. మధ్యాహ్నం పన్నెండు గంటలకి అన్నాను. 'పోష్టంటే పళ్ళుతోముకుంటారు చూడమ్మా' అదీ.... అంది. విడమరచి చెబుతూ. నాకు నవ్వాగ లేదు. నవ్వితే ఏమనుకుంటారోనని ఆపుకుని పేస్ట్ యిచ్చాను. స్నానఘట్టం ముగించి యిద్దరూ పూజకి ఉపక్రమించారు. వారికేం కావాలో అని అటువైపు వచ్చిన నన్ను చూడగానే" అమ్మా... ఒక్క సిల్కుచీర వుంటే ఇవ్వమ్మా... మడి గట్టుకుంటాను. పట్టుదైనా పర్వాలేదనుకో అంది గం.భా.స. ఇక తప్పుతుందా అని చీర యిచ్చాను. అంతసేపూ అవతల గదిలో వున్న మావారు గొణుగుతూనే వున్నారు. ఆయనకి సర్ది చెప్పడానికి నా తల ప్రాణంతోకకి వచ్చింది. మడి వంట కాబట్టి వంటకి కావలసినవి ఇవ్వబో తూంటే గం.భా.స. "అమ్మా... ఒక్క రెండు శేర్ల బియ్యం, అర్థ శేరు పప్పు, అందులోకి ఆనపకాయ, కాస్త చారులోకి టమోటాలు" అని... ఒంటిపూట భోజనం తల్లీ.... కొంచెం దోసకాయ, వంకాయ కలిసి బండపచ్చడి చేసుకుంటాం. చింతపండు, నూనె కొంచెం ఎక్కువ ఇవ్వమ్మా, పులిహోర కలుపు తాను ఆ చేత్తోనే. ఇహ... పెరుగు, నెయ్యి అబ్బాయిని పంపించి తెప్పించమ్మా... దేవుళ్ళాడుతూ వచ్చిన అతిథులం. అలా లేదనకూడదు' అంది. ఆయన మొదట ససేమిరా వెళ్ళనన్నారు. చివరికి నేను పోరగా వెళ్ళక తప్పిందికాదు. మొత్తానికి ఎట్లాగైతేనేం వంట పూర్తయిందనిపించి "బ్రేవ్" మని త్రేన్చారు. "అమ్మాయ్... ఇది మైసూరు సిల్కేకదూ... నీ పేరు చెప్పుకుని మడికట్టుకుంటాను తల్లీ... అంది గం.భా.స. చీర విప్పకుండానే. అసలే ఆవిడ నోరు మంచిది కాదు, ఎందుకొచ్చిన గొడవ అని వూరుకున్నాను. వాళ్ళుకాస్త కునుకు తీశారో లేదో బైట టాక్సీ ఆగింది. ఉలిక్కిపడి లేచి కూర్చున్నా రిద్దరూ "అమ్మాయ్.... ఎవరే ఆ వచ్చింది?" అంది కుంకుమ. "మామగారై వుంటారు" అంటూ చూడడానికి బైటకి వెళ్ళాను. నే వచ్చేసరికి వాళ్ళిద్దరూ 'బండికి టైమైపోయింది' అంటూ బయల్దేరడానికి ఉద్యుక్తులయ్యారు. 'మామగారొచ్చేశారు' అన్నాను. 'ఆc...ఆc... చూస్తాంగా' అంటూ మూటా ముల్లెతో సహా గుమ్మం వైపు వెళ్ళారు. నేను వాళ్ళ వెనకే వెళ్ళాను. మా ఆయన నా వెనకే వచ్చారు. అంత వరకూ టాక్సీలో ఎవరో స్నేహితుడితో మాట్లాడుతున్న మా మామగారు టాక్సీ దిగి తననెదురుపడిన యిద్దరు 'అతిథుల్ని' చూసి ఆగారు. ఆయన తమవైపు చూడగానే కంగారు కంగారుగా వీధిలోకి పరుగెత్తారు గం.భా.స, కుం.శో. నేను అయోమయంగా చూస్తూండిపోయాను. 'ఎవరమ్మా వీళ్లు' అన్న మామగారి ప్రశ్న వినిపించి ఉలిక్కి పడ్డాను.

మీ బంధువులని చెప్పారు... అయితే నన్ను చూసి ఎందుకు పారిపోతున్నారు? అయినా వాళ్ళని ఎప్పుడూ చూసినట్లు లేదు.. నేను తెల్లమొహం వేసి మా ఆయనకేసి చూసాను. మా ఆయన నా వైపు ఎగతాళిగా చూస్తూ 'అన్నపూర్ణమ్మతల్లీ' అని వాళ్ళు యధాలాపంగా పిలవగానే మురిసిపోయావు. అతిథులు దేవుళ్ళతో సమానం అని సకల మర్యాదలు చేసావ్.. చివరికి నీ చీరకాస్తా పట్టుకు పోయారు. చూశావా" అన్నారు. "మొత్తానికి బ్రతక నేర్చిన వాళ్ళు. నేనుండివుంటే మరొలా నాటకం ఆడి వుండేవారేమో" అంటున్న మామగారివైపు చూడగానే 'సరే నా పేరు యధాలాపంగా కలిపిందనుకుంటే మరి మామగారి పేరెలా తెలిసింది వాళ్ళకి' అన్న సందేహం వచ్చింది. ఆ మాటే అన్నాను. "నాకూ యిప్పుడే తట్టింది. ఇదిగో యిటుచూడు" అన్నారు మావారు. కాంపౌండ్ గేటుకి పూర్ణ చంద్రరావు అని తెలుగులో పెద్ద అక్షరాలతో వున్న నేమ్ ప్లేట్ నన్ను వెక్కిరించింది. ❖

జూన్ 21, 1862న మొదటిసారిగా ఒక భారతీయుడు జ్ఞానేంద్ర మోహన్ టాగూర్ బారిష్టర్– ఎట్–లా పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు.